
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శనివారం 16 నవంబరు 2024



నామినేటెడ్ పదవులపై అసంతృప్తి

నరసాపురం టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నరసాపురం తెలుగుదేశం పార్టీలో నామినేటెడ్ పదవుల అసం తృప్తి రాజుకుంటున్నది. సుదీర్ఘకాలం పార్టీలో ఉన్నప్పటికీ సరైన గుర్తింపు రాకపోవడంతో కొందరు సీనియర్లు గుర్రుగా ఉన్నారు. వైసీపీ హయాంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి కేసులు ఎదుర్కొంటే పార్టీ అధికారంలోకి వచ్చినా సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై గుడ్ బై చెప్పేందుకు సిద్ధం అవుతున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలో కొన సాగుతున్న ఆ పార్టీ రాష్ట్ర అగ్ని కుల క్షత్రియ సాధికార కన్వీనర్ కొప్పాడ రవి రెండు విడతల నామినేటెట్ పదవుల జాబితాలో తన పేరు లేకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. పార్టీకి గుడ్‌బై చెప్పనున్నట్లు శుక్రవారం నియోజకవర్గ నేతలకు తెలియజేశారు. వారు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. శనివారం తన రాజీనామాను పార్టీ అధిష్ఠానానికి పంపనున్నట్లు రవి తెలిపారు. మరోవైపు పార్టీ సీనియర్ నేత వాతాడి ఉమాకు అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి దక్కింది. దీనిపై ఆసక్తి చూపించడం లేదు. తనకు ఈ పదవి వద్దంటూ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామరాజుకు స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానానికి తెలియజేశారు.

సర్వేల పేరిట పశు వైద్యానికి దూరం

భీమవరం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధక శాఖలో పనిచేసే సహాయకులు సర్వేల పేరిట వెళుతుండడంతో పశు వైద్యానికి ఇబ్బందిగా మారింది. జిల్లావ్యాప్తంగా 180 మంది పనిచేస్తున్నారు. వీరికి గ్రా మాల వారీగా స్కిల్ సెన్సెక్స్ మ్యాటగింగ్, జియో హౌస్‌హోల్డ్ టాగింగ్, అపార్ సర్వేలను అప్పగించారు. ఫలితం గా వీరు పశువుల వైద్యానికి దూరమయ్యారు. గ్రామాల వారీగా పశువులకు పశు సంవర్థకశాఖ సహాయకులు చేయాల్సిన ప్రాథమిక పనులు సగం సగంగానే జరుగుతున్నాయి. గ్రామాల్లో పశువులకందించే ప్రథమ చికిత్స, కృత్రిమ గర్భధారణ, సీజనల్ వ్యాక్సిన్‌లకు వారు అందు బాటులో ఉండడం లేదని రైతులు విమర్శిస్తున్నారు.

ఆచంటలో అఖండ జ్యోతి







ప్రత్యేక అలంకరణలో భీమవరం సోమేశ్వరస్వామి.. పాలకొల్లు క్షీర రామలింగేశ్వరస్వామి



ఏలూరు శ్రీ చౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి ఆలయంలో జ్వాలా తోరణం..

కార్తీక వైభవం

'హరోం హర.. ఓం నమశ్శివాయ.. శంభో శంకరా..' అంటూ భక్తుల శివ నామస్మరణతో జిల్లాలోని శైవ క్షేత్రాలు మర్మోగాయి. శుక్రవారం వేకువజాము నుంచే ఆలయాలు పోటెత్తాయి. వేలాది మంది సమక్షంలో ఆచంట శ్రీ ఉమా రామేశ్వరస్వామి ఆలయం వద్ద అఖండ జ్యోతి(కర్పూర జ్యోతి)ని వెలిగించారు. ఆవు నెయ్యి వేసేందుకు క్యూ కట్టారు. పంచారామ క్షేత్రాలైన పాలకొల్లు, భీమవరంతోపాటు పట్టిసీమ క్షేత్రాలు కిటకిటలాడాయి. రాత్రి జ్వాలా తోరణం వెలిగించారు. 6లో

• పంటు.. వెళ్లిపోయింది



నరసాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):నరసాపురం - సఖినేటిపల్లి రేవుల మధ్య మూడేళ్లపాటు ప్రయాణికులను ఒడ్డుకు చేర్చిన ప్రభుత్వ పంటు ధవళేశ్వరం బయలుదేరింది. నీటి పారుదల శాఖకు చెందిన ఈ పంటును గోదావరి నుంచి ఇసుక ర్యాంపులోని పాయ గుండా లాకుల వద్దకు తీసుకొచ్చారు. అక్కడ నాలుగు భారీ క్రేన్‌ల సహాయంతో లారీ ట్రాలీలోకి ఎక్కించారు. శుక్రవారం సాయంత్రం ట్రాలీ బయలుదేరింది. కొవిడ్ సమయంలో రేవు పాట నిర్వహించలేదు. రెండేళ్ల పాటు రేవు నిర్వహణను మండల పరిషత్ చేపట్టింది. ఆ సమయంలో ఈ పంటును ధవళేశ్వరం నుంచి రప్పించారు. ప్రభుత్వానికి రోజు రూ.2 వేలు చొప్పున చెల్లిస్తూ వచ్చారు. గత ఏడాది పాటదారుడు దీనిని వాడుకున్నారు. ఇప్పటి పాటదారుడికి సొంతంగా పంటులు ఉండడంతో దీనిని వినియోగించడం లేదు.

• ఉత్తమ సేవలందించాలి..



భీమవరం టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్‌కు ఎంపికై ముస్సోరీలో శిక్షణ పొందుతున్న పది మంది ప్రొబేషనరీ అధికారులు ఫీల్డ్ స్టడీ అండ్ రీసెర్చ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఐదు రోజులుగా జిల్లాలో పర్యటిస్తున్నారు. వీరు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన, అవగాహన చేసుకున్న అంశాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి క్షేత్రస్థాయిలో అవగాహన చేసుకుని ఉత్తమ సేవలందించాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు కాత్యాని సింగ్, రూపాలి సున, భగత్ షమల్ కళ్యాణ్ రావు, నౌషీన్, శ్రీకృష్ణ శ్రీరామ సుహెర్, యాష్ చంద్రప్రకాష్ సింఘాల్, లక్ష్మణ్ ఆనంద్, సుశాంత్‌కుమార్, రాజేష్ కుమార్, అనికెట్ శాండిల్య తదితరులు ఉన్నారు.

పల్లెలకు స్వచ్ఛ నీరు



పట్టాలపైకి వాటర్ గ్రిడ్ పథకం

- గోదావరి నుంచి మళ్లింపు
- పైప్‌లైన్ ద్వారా శుద్ధి జలాలు
- గత ప్రభుత్వ అంచనాలకు సవరణ
- కొత్త ధరలతో ప్రతిపాదనలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

చుట్టూ గోదావరి జలాలు వున్నా జిల్లా వాసులకు సురక్షిత నీరు కరువు. కాల్వలన్నీ కలుషితం. దాహార్తి తీర్చుకోవడానికి సురక్షితమైన నీటి కోసం ఏటా కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. దీనిని అధిగమించేందుకు గత తెలుగుదేశం ప్రభుత్వంలో వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దీనికి నిధులు కేటాయించలేదు. కాని, ప్రాజెక్ట్ పనులు ప్రారంభించినట్టు జగన్ హడావుడి చేశారు. ప్రాజెక్ట్‌ను పల్లెలకు మాత్రమే పరిమితం చేశారు. ఇందుకు రూ.1420 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఏజన్సీని ఖరారు చేసింది. సర్వే కూడా పూర్తి చేయలేదు. పనులు ప్రారంభించలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో వాటర్‌గ్రిడ్ ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా అంచనాలను సవరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. గతంలో మినహాయించిన గ్రామాలను అవసరమైతే ప్రాజెక్ట్‌లో కలపాలని దిశానిర్దేశం చేసింది. ఆ పనిలో గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు తలమునకలవుతున్నారు. ఫలితంగా ప్రాజెక్ట్ వ్యయం పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటా నిధులు భరిస్తాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్ట్‌లను చేపట్టాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. తొలుత పశ్చిమలో ప్రాజెక్ట్‌ను పూర్తి చేయనున్నారు. జిల్లాలోని 409 పంచాయతీలకు మంచినీటి సమస్య తీరనుంది. వేసవిలోనూ సమృద్ధిగా స్వచ్ఛమైన గోదావరి జలాలు సరఫరా చేయనున్నారు.

మూడు పైపు లైన్ల ద్వారా సరఫరా

గోదావరి జలాలను శుద్ధి చేసి నేరుగా పల్లెలకు తరలిస్తారు. అక్కడ ఓహెచ్‌ఆర్‌ల నుంచి కుళాయిలకు సరఫరా చేస్తారు. ఇందుకు మూడు సరఫరా లైన్‌లను వేస్తారు. విజ్జేశ్వరం నుంచి నర్సాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం వైపు ఈ పైప్‌లైన్‌లు ఉంటాయి. వాటి నుంచి సబ్ పైపులైన్‌ల ద్వారా ప్రతి గ్రామానికి శుద్ధి చేసిన మంచినీటిని అందిస్తారు. విజ్జేశ్వరం వద్ద గోదావరి జలాలను తోడి శుద్ధి చేసేందుకు జిల్లాలోని ఎగువ భాగంలో ప్లాంట్‌ను నిర్మించనున్నారు. అక్కడే శుద్ధి జరుగుతుంది. అక్కడ నుంచి మంచినీరు గ్రామాలకు సరఫరా అవుతుంది. దీనివల్ల కలుషిత జలాలకు చెక్ పడుతుంది. జిల్లా ప్రజలకు గోదావరి జలాలు గొంతు తడపనున్నాయి. దీనిపై జిల్లా ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నీటి ఎద్దడి రాకూడదు

- ఏప్రిల్ 15న కాల్వల కట్టివేత.. జూన్ 1న విడుదల : నీటి పారుదల సలహా సమావేశంలో కలెక్టర్ నాగరాణి

భీమవరం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 'ఈ ఏడాది మూడుసార్లు వరదలు, మరో మూడుసార్లు తుఫాన్లు వచ్చాయి. దీనితో రైతులు ఇబ్బందులు పడ్డారు. కావున కాల్వలు, డ్రెయిన్లు మరమ్మతు పనులపై దృష్టి సారించాలి. ఎక్కడ ఏ పనులు చేయాలో వారం రోజుల్లోగా పూర్తిస్థాయి నివేదిక ఇవ్వండి' అంటూ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నీటిపారుదల సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. 'రబీలో సాగు నీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుని పక్కాగా అమలుచేయాలి. డిసెంబరు 31వ తేదీలోగా అన్ని చెరువులు, ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్‌లను నింపుకోవాలి. ఏప్రిల్ 15వ తేదీన కాలువలు మూసివేసి జూన్ 1న తిరిగి నీటిని వదులుతారు. పూర్తిస్థాయిలో కాలువలోకి నీరు రావడానికి మరో పదిరోజులు పడుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని తాగు, సాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి. రబీకి నీటి లభ్యత తక్కువగా ఉన్నందున పొదుపు పాటించాలి. డ్రెయిన్లకు అడ్డు కట్టలు వేయడం, ఆయిల్ ఇంజన్ల ఏర్పాటు, వంతుల వారీ విధానం ద్వారా ప్రతి ఎకరాకు నీటి నందించాలి. కాలువలు, డ్రెయిన్లలో ఎప్పటికప్పుడు చెత్తా చెదారాన్ని తొలగించాలి' అని కలెక్టర్ ఆదేశించారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దాసి రాజు, ఖతీబ్ కౌసర్ భానో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నారికేళం ధరహాసం

- కార్తీకంలో కొబ్బరికి డిమాండ్
- వెయ్యి కాయలు రూ.13 వేల నుంచి 18 వేలకు
- పండుగల్లో పెరిగిన వినియోగం
- ఉమ్మడి తూర్పులో గరిష్ఠ ధర
- పశ్చిమలోనూ రైతు వారీ కొనుగోళ్లు ముమ్మరం


7



హలో.. సుప్రీంకోర్టు నుంచి మాట్లాడుతున్నాం

- మీపై కేసు నమోదైంది..ష్యూరిటీ బెయిల్‌కు సొమ్ము చెల్లించాలి
- రిటైర్డ్ ఉద్యోగికి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌లో బెదిరింపు
- రూ.16.55 లక్షలు అపహరణ
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు.. కేసు నమోదు

7



కొల్లేరు ముంపు పాపం ప్రభుత్వాలదే

- సమస్యలు పరిష్కరించకుంటే ఫిబ్రవరి 1 నుంచి దీక్షలు
- అసెంబ్లీకి వెళ్లకపోవడమంటే ప్రజలను అవమానించడమే
- జగన్ రాజీనామా చేయాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్

7



బొమ్మ చెరిపేలా

సర్వే రాళ్లపై జగన్ చిత్రం
తొలగింపునకు ఆదేశం

6

నీటి పన్నులపై నిర్లక్ష్యమేల?

- పట్టణాల్లో వసూలు కావాల్సింది రూ.19.84 కోట్లు
- వసూలు 3.59 కోట్లు.. పెండింగ్ 16.15 కోట్లు
- అసలే ఆర్థిక కష్టాలు.. ఆపై నాలుగు నెలల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- ఉన్నతాధికారుల ప్రత్యేక దృష్టి.. కమిషనర్లపై ఒత్తిడి

భీమవరం టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే వుంది. మున్సిపాలిటీలకు ఇప్పటిలో నిధులు ఇచ్చే అవకాశం లేదు. కొంత కాలం వేచి చూడాలని సంకేతాలు పంపింది. పెండింగ్ బిల్లులు కూడా ఇవ్వడం లేదు. ఇటు చూస్తే మున్సిపాలిటీలకు ఖర్చులు పెరుగుతున్నాయి. ఈ సమయంలో ప్రతిపైసా ముఖ్యమే. కాని, ఇక్కడి అధికారులు మాత్రం పన్నుల వసూళ్లలో వెనుకబడుతున్నారు. లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. మంచినీటి సరఫరాకు ఏటా కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నా.. ప్రజల నుంచి నీటి పన్నులు వసూలు చేయడంలో లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. నామమాత్రపు వసూళ్లతో సరిపెడుతున్నారు. ఇటీవల భీమవరంలో జరిగిన జిల్లా మునిసిపల్ కమిషనర్ల సమీక్షలో ఆర్డీ సీహెచ్ నాగ నరసింహారావు మండిపడ్డారు. వసూళ్ల వేగం పెంచాలని ఆదేశించారు. జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం మునిసిపాలిటీలతోపాటు ఆకివీడు నగర పంచాయతీల్లో ఈ ఏడాది ఏడాదికి రూ.19.84 కోట్లు నీటి పన్ను వసూలుచేయాలి. కాని, వసూలైంది కేవలం రూ.3.59 కోట్లు. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అంటే మరో నాలుగు నెలల కాలంలో వసూలు చేయాల్సింది రూ.16.15 కోట్లు. వీటి వసూలుకు సచివాలయ సిబ్బందిని ఉపయోగించాలని దిశా నిర్దేశం చేశారు.



మునిసిపాలిటీలు	డిమాండ్	వసూలైంది	పెండింగ్
తాడేపల్లిగూడెం	7.78 కోట్లు	91 లక్షలు	5.87 కోట్లు
భీమవరం	5.46 కోట్లు	1.18 కోట్లు	4.28 కోట్లు
పాలకొల్లు	3.03 కోట్లు	61.63 లక్షలు	2.41 కోట్లు
నర్సాపురం	2.67 కోట్లు	55.62 లక్షలు	2.11 కోట్లు
తణుకు	88.16 లక్షలు	18.11 లక్షలు	70.05 లక్షలు
ఆకివీడు	14.13 లక్షలు	14.13 లక్షలు	-

(రూపాయల్లో)

స్వయం సహాయక సంఘాల వివరాల సేకరణ

భీమవరం టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణ మహిళా సంఘాల సభ్యుల వివరాలను మెప్మా అధికారులు సేకరిస్తున్నారు. జిల్లాలోని 9,380 సంఘాల్లో 97,193 మంది సభ్యులున్నారు. వీరి పూర్తి వివరాలను 2014లో నమోదు చేశారు. తర్వాత గత ప్రభుత్వ హయాంలో డ్వాక్రా రుణమాఫీ సమయంలో ఆన్‌లైన్ చేశారు. తర్వాత గ్రూపులకు సంబంధించి ఎలాంటి వివరాలు నమోదు చేయలేదు. వారి ఆర్థిక పుష్టి, గ్రూపు సభ్యుల సంఖ్య, తీసుకున్న రుణాలు ? చెల్లించాల్సిన బకాయిలు ? గ్రూపులో ఎవరైనా చనిపోయారా ? గ్రూపు నుంచి వెళ్లిపోయారా ? కొత్తగా చేరారా ? సభ్యులు పది మందీ ఉన్నారా ? చేస్తున్న వ్యాపారం ఏమిటి ? ఆదాయం ఎలా ఉంది ? ఎవరెవరు ఏ ఏ గ్రేడింగ్‌ల్లో ఉన్నారు వంటి వివరాలను సేకరించి ప్రొఫైలింగ్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. వీటి ఆధారంగా మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. స్వయం సహాయక సంఘాల వివరాలను యాప్ ద్వారా నమోదు చేయడం వల్ల సభ్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సీఎంఎం సుధాకర్ చెప్పారు.



మునిసిపాలిటీ	గ్రూపులు	సభ్యులు
ఆకివీడు	618	6,810
భీమవరం	2,519	25,551
నరసాపురం	907	9,137
పాలకొల్లు	1,652	17,690
తాడేపల్లిగూడెం	2,098	21,436
తణుకు	1546	16,569
మొత్తం	9380	97,193


పెనుగొండ మండలం సిద్ధాంతం గోదావరి రేవులో దీపారాధన


భక్తులతో కిటకిటలాడిన నరసాపురం వలంధర్ రేవు


పట్టిసీమ క్షేత్రం వద్ద గోదావరి హారతి పూజలు


భీమవరం సోమేశ్వరాలయంలో భక్తుల పూజలు

శివోహం

కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పంచారామ క్షేత్రాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భీమవరంలోని సోమేశ్వరస్వామి ఆలయం లో మహిళలు 365 ఆవు నేతి వత్తులను వెలిగించారు. సాలగ్రామ, ఉసిరి, దానాలు చేసుకున్నారు. నవ వధువులతో కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవార్లకు పసుపు, కందమొక్క, బియ్యం, జాకెట్టు ముక్కతో వాయినం అందించారు. కార్తీక చంద్ర దర్శనం చేసుకుని ఉపవాస దీక్ష విరమించారు. రాత్రి ఆలయం వద్ద జ్వాలా తోరణం వెలిగించారు. పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆచంటేశ్వరుడి ఆలయం వేకువజాము నుంచి సాయంత్రం వరకు భక్తులతో పోటెత్తింది. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించుకున్నారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పట్టిసీమ శివక్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి బిల్వార్చన, భస్మార్చన ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. పట్టిసీమ ఫెర్రీ రేవులో గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించారు. ఏక దీప హారతి, త్రిదీప హారతి, పంచదీప హారతి, అష్టోత్తర దీపహారతి, కుంభ హారతి , ధూప హారతి నిర్వహించారు. అనంతరం పట్టిసీమలో జ్వాలా తోరణం కార్యక్రమం నిర్వహించారు. గోదావరి హారతి కార్యక్రమంలో వేద పండితులు అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు సిద్ధాంతం వశిష్ట గోదావరి పంచ హారతులు వైభవంగా నిర్వహించారు. ఏక ముఖ, ద్విముఖ, చతుర్ధ పంచమ, కుంభ, నక్షత్ర, పూర్ణకుంభ, సర్ప హారతుల కార్యక్రమం నిర్వహించారు. పంచహారతుల సందర్భంగా గోదావరి తీరం భక్తులతో కిటకిటలాడింది. నరసాపురం గోదావరి తీరంలో వలంధర్ రేవు భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. గోదావరిలో స్నానాలు చేసి కార్తీకదీపాలు విడిచి పెట్టారు. పలువురు గట్టుపై నోములు నోచుకున్నారు.

భీమవరం టౌన్, పాలకొల్లు అర్బన్, ఆచంట, పోలవరం, పెనుగొండ, నరసాపురం టౌన్



ఆచంటేశ్వర క్షేత్రంలో

అఖండ జ్యోతి

ఆచంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ ఆచంట ఉమా రామేశ్వరస్వామి ఆలయంలో వేలాది మంది భక్తుల శివనామ స్మరణ మధ్య శుక్రవారం సాయంత్రం అఖండ జ్యోతి (కర్పూర జ్యోతి) ప్రజ్వలన జరిగింది. ముందుగా గంధర్వ మహల్‌కు చెందిన గొడవర్తి వంశీయులు కృత్తికా నక్షత్ర హోమం, మండపారాధన, మహా నైవేద్యం, ధూపసేన నిర్వహించి అనంతరం కర్పూర జ్యోతిని వెలిగించారు. కర్పూర జ్యోతిలో ఆవు నెయ్యి వేయడానికి భక్తులు పోటీ పడ్డారు. సుమారు పది వేల మంది భక్తులు కర్పూర జ్యోతి కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు వెలిగించిన అఖండ జ్యోతి జనవరి వరకు నిరంతరం వెలుగుతూ ఉంటుంది. అప్పటి వరకు ప్రతీ రోజూ భక్తులు కర్పూర జ్యోతిలో ఆవు నెయ్యి వేసి మొక్కులు తీర్చుకుంటారు. కర్పూర జ్యోతి అనంతరం ఆలయం వద్ద జ్వాలా తోరణం వెలిగించారు. స్వామి ప్రభను గ్రామంలో ఊరేగించారు. భక్తులకు ఆలయ అధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ, గజేశ్వరావు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ కట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.


గునుపూడి సోమేశ్వరాలయంలో వేదాశీర్వచనం తీసుకుంటున్న ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీమోహన్

పంచారామాల్లో వాణీమోహన్ పూజలు

భీమవరం టౌన్/పాలకొల్లు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని పంచారామ క్షేత్రాలైన గునుపూడిలోని సోమేశ్వరస్వామి, పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరుడిని జనరల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిమోహన్ శుక్రవారం దర్శించుకుని పూజలు చేశారు. గునుపూడి ఆలయంలో ఆమెకు ఆలమ ఈవో రామకృష్ణంరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకుడు చెరుకూరి రామకృష్ణ పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. పార్వతీ దేవి, అన్నపూర్ణాదేవి, జనార్ధనస్వామివారిని దర్శించుకుని పూజలు చేయించుకున్నారు. పాలకొల్లు ఆలయంలో ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం స్వామివారి శేష వస్త్రాన్ని, చిత్రపటాన్ని ఈవో శ్రీనివాసరావు అందించారు పండితులు వేదాశ్వీరచనం ఇచ్చారు.

కైకరంలో షష్ఠి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


షష్ఠి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కైకరం శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శుక్రవారం ఆవిష్కరించారు. ఆలయ కమిటీ తరపున జడ్పీటీసీ మాజీ సభ్యుడు సలగాల గోపి, చింతల శ్రీనివాస్, పామర్తి సత్తిబాబు, చిప్పాడరాజు, గురువెల్లి నాగేశ్వరరావు, యెగ్గిన హేమ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న రామదండు సభ్యులు మొటపర్తి రాజా బాబు

మోటారు సైకిళ్లపై 6 శివాలయాల దర్శనం

దెందులూరు,నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వందలాది మంది భక్తులు మోటారు సైకిళ్లపై ర్యాలీగా వెళ్లి 6 పురాతన శివాలయాల్లో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. హిందూ సంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణలో భాగంగా స్థానిక హిందూ పరిరక్షణ సమితి, రామదండు సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. హిందూ మతం అంటే ధర్మానికి, న్యాయానికి కట్టుబడడమేనని హిందూ పరిరక్షణ, రామదండు సభ్యులు మోటపర్తి రాజా, సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా దెందులూరులోని అతి పురాతన శివాలయంలో శుక్రవారం వందలాది మంది భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఒకేసారి 6 పురాతన శివాలయాల దర్శనానికి రామదండు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీని సుగ్గిశెట్టి నూకరాజు, మోటపర్తి రాజాబాబు ప్రారంభించారు. హిందూ ధర్మాన్ని రక్షించేందుకు ఈ కార్యక్రమం తలపెట్టామన్నారు. దెందులూరు, చల్లచింతలపూడి శ్రీమేధా దక్షిణమూర్తి ఆలయంల జోగన్నపాలెం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామవరం పంగిడిగూడెం ద్వారకాతిరుమల శివ క్షేత్రాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో బైక్‌పై ర్యాలీ నిర్వహించి హిందూ ధర్మం వర్ధిల్లాలని నినాదాలు చేశారు, రామదండు సభ్యులు, అయ్యప్ప మాలధారులు, రాజేష్ తులసీదాస్, తదితరులు పాల్గొన్నారు




గునుపూడి సోమేశ్వరుడికి అభిషేకం, ఆచంట, పట్టిసీమలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ


ఏలూరులో స్ఫటిక లింగం




పెనుగొండ, ఏలూరు పత్తేబాద, పాలకొల్లు పంచారామాల్లో స్వామి వారికి అలంకరణ


ఆచంట ఉమా రామేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలాతోరణం

కార్తీక దీపం


భీమవరం కనకదుర్గ ఆలయం వద్ద కార్తీక దీపోత్సవం

• శివాలయాల్లో పౌర్ణమి శోభ • దీపాల వెలుగు • ప్రత్యేక పూజలు • వైభవంగా జ్వాలా తోరణం




శైవ క్షేత్రాలు కార్తీక పౌర్ణమి వెలుగులు, దీప కాంతులతో ఆధ్యాత్మిక శోభను వెదజల్లాయి. భక్తుల శివ నామస్మరణతో మార్మోగాయి. పున్నమి చంద్రుడు కాంతులీను వేళ మహిళలు దీపారాధనతో స్వామి వారికి పూజలు చేశారు. ధ్వజ స్తంభాలు, ఆలయ ఆవరణలో ఉసిరి చెట్ల వద్ద దీపాలు వెలిగించారు. పలువురు మహిళలు 365 నేతి ఒత్తులు వెలిగించి పూజల అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు ఆలయాల వద్ద జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. భక్తుల దీపారాధన ముగుస్తుండగా శివాలయాల వద్ద జ్వాలా తోరణం వెలిగించడంతో స్వామి, అమ్మవార్లు జ్వాలల కింది నుంచి ముమ్మారు తిరిగి భక్తులను కరుణించారు. అదే సమయంలో భక్తుల శివనామ స్మరణ మిన్నంటింది. భక్తిభావంతో స్వామి వారికి మొక్కుకున్నారు. జ్వాలా తోరణం ఆరిన తర్వాత కాలిన గడ్డిపరకలు భక్తులు తీసుకెళ్లారు. అనంతరం స్వామి అమ్మవార్లు బాజాభజంత్రీల నడుమ పుర వీధుల్లో ఊరేగారు.





ఏలూరు అవిముక్తేశ్వరస్వామి ఆలయంలో దీపారాధన


పెనుగొండ మండలం సిద్ధాంతంలో గోదావరి హారతి


ఏలూరు చౌదేశ్వరి రామలింగేశ్వరాలయంలో దీపారాధన


ఏలూరు రామకోటి వద్ద శివాలయంలో పూజలు


గునుపూడి సోమేశ్వరాలయంలో భక్తుల రద్దీ


సిద్ధాంతం కేదారేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి భక్తుల పూజలు


ఆచంట ఉమా రామేశ్వరస్వామి ఆలయ ఆవరణలో భక్తుల పూజలు

గురుకుల పాఠశాల విద్యార్థుల జోనల్ స్థాయి క్రీడా పోటీలు


పోలసానపల్లి గురుకుల పాఠశాల ఆవరణలో కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

భీమడోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలసానపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో జరుగుతున్న జోనల్ స్పోర్ట్స్‌మీట్ శుక్రవారం రెండోరోజుకు చేరుకున్నాయి. మొదటి రోజు రెండవ రోజు నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొన్న విజేతలను శుక్రవారం ప్రకటించారు. సర్కిల్ విభాగంలో 1500 మీటర్ల పరుగు పందెంలో జంగారెడ్డిగూడానికి చెందిన వి.ఇందు, పోలసానపల్లి గురుకుల పాఠశాలకు చెందిన నిత్యశ్రీ, జంగారెడ్డిగూడానికి చెందిన పూజ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. షార్ట్‌పుట్ విభాగంలో ముత్తళ్ళకు చెందిన పి.కీర్తన, కొవ్వూరుకు చెందిన పి.కృష్ణవేణి, వి.శ్రీలత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. కాలేజీ విభాగం షార్ట్‌పుట్‌లో తునికి చెందిన లావణ్య, ముత్తళ్ళకు చెందిన లిఖిత, కె.రమ్య ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. డిస్కస్ త్రోలో తునికి చెందిన లావణ్య, పుట్టముక్కలకు చెందిన కె.నిధి, ముత్తళ్ళకు చెందిన వి.నిఖిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మిగిలిన విభాగాల్లోని కబడ్డీ, ఖోఖో, హ్యాండ్‌బాల్, చెస్ పోటీల్లో తొలి రౌండ్ ముగిసి ఫైనల్స్ జరగాల్సి ఉంది. పీఈటీలు, క్రీడా విభాగం అధికారులు పోటీలను పర్యవేక్షిస్తున్నారు.



దిష్టి రాళ్లకు చెక్!

• సర్వే రాళ్లపై జగన్ బొమ్మ, పేర్లు తొలగింపు • కొద్దిరోజుల్లోనే పనులు ప్రారంభం

ఏలూరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూముల రీసర్వేలో పాతిన హద్దు రాళ్లు దిష్టిబొమ్మలుగా పడి ఉన్నాయి. వాటిపై జగన్ బొమ్మలు, పేర్లను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. ఎక్కువ నిధులు ఖర్చు చేయకుండా బొమ్మలు, పేర్లు చెరిపి వేయాలని రెవెన్యూశాఖకు సూచించింది. వారం, పదిరోజుల్లో సరిహద్దు రాళ్లను సాఫీగా మార్చేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధమైంది. శ్యాండ్‌వాష్ టెక్నాలజీని వినియోగించాలని భావిస్తోంది. ఒకవేళ ఖర్చుతో కూడుకున్నట్లయితే మాన్యువల్‌గా చేసేవారికి పనిని అప్పగించాలని యోచిస్తోంది. భూముల రీసర్వే కార్యక్రమానికి గత వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంగా పేరు పెట్టి అమల్లోకి తీసుకొచ్చింది. జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలుచేసి ఆ తరువాత గ్రామాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించారు. సాధారణంగా ఏవైనా భూములు సర్వేని ప్రభుత్వం చేపడితే హద్దురాళ్లపై ఎటువంటి పేర్లు, బొమ్మలు వేయదు. టైటిల్ డీడ్‌పైనే భూహక్కుదారు పేరు మాత్రమే ఉంటుంది. అటువంటిది వైసీపీ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా టైటిల్ డీడ్‌పై జగన్ ఫొటోలను ముద్రించి మరోవైపు భూముల హద్దు రాళ్లపై జగన్ ఫొటోలు, పేర్లు, వైసీపీ రంగులు అద్దింది. దీనిని పలువురు భూ యజమానులు అభ్యంతర పెట్టినా పరిగణనలోకి తీసుకోలేదు. టైటిల్‌డీడ్, హద్దురాళ్లపై ఫొటోలతో అవి జగన్‌కు చెందిన ఆస్తులుగా ఉన్నట్లు చిత్రీకరణ జరిగింది. ఎన్నికల ముందు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లింది. మీ ఆస్తులపై జగన్ ఫొటోలు, పేర్లు ఏంటి మళ్ళీ అధికారంలోకి వస్తే వీటిని కొట్టేసినా, తాకట్టు పెట్టినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని హెచ్చరించాయి. దీంతో ప్రజల్లో తమ భూములు లాక్కుంటారన్న భయం ఏర్పడింది. ఏలూరు జిల్లాలో పలు మండలాల్లో సుమారు 70 వేలకు పైగా హద్దురాళ్లను పాతినట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. వాటిని తొలగించేందుకు ఒక్కో రాయికి రూ.15 వరకు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్‌ను ఎంపిక చేస్తారు. అనంతరం హద్దురాళ్లపై జగన్ బొమ్మలు, పేర్లను సమూలంగా తొలగిస్తారని రెవెన్యూ, సర్వే అధికారులు తెలిపారు.

పున్నమి రాత్రి



పున్నమి వేళ రెండు పొడపాములు సయ్యాటలాడుతూ చూపరులను అబ్బురపరిచాయి. సాధారణంగా త్రాచు, జెర్రిగొడ్డు మసకలాడటం చూస్తుంటాం. శుక్రవారం శివాలయం సమీపంలో రెండు భారీ పొడపాములు దాదాపు గంట సేపు పెనవేసుకుని కన్పించాయి. పౌర్ణమి పర్వదినం కావడంతో తెల్లవారు జామున శివదేవుని ఆలయానికి వచ్చిన భక్తులకు ఈ దృశ్యం కంటపడింది.

- ద్వారకాతిరుమల

నరికేసినా మొలుస్తా..


అరటి మోడుకు మొలిచిన గెల

నరికేసినా మొలుస్తా అంటూ.. అరటి మోడు గెలతో సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. పోలవరం బాపూజీ కాలనీలో పంచాయతీ పారిశుధ్య కార్మికుడు బోడపాటి ఎలీషా ఇంటి ఆవరణలో అరటి చెట్టు గెల కోసి మొదలంటూ నరికేశాడు. కొన్ని రోజులకు మోడుకు గెలతో పూత రావడంతో స్థానికులు వింతగా చూశారు.

- పోలవరం

కొల్లేరు ముంపు పాపం ప్రభుత్వాలదే

సమస్యలు పరిష్కరించకుంటే ఫిబ్రవరి 1 నుంచి దీక్షలు
సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ


పెనుమాకలంకలో ప్రసంగిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

మండవల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కొల్లేరు ముంపు పాపం ప్రభుత్వాలదేనని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. కొల్లేరు పరిరక్షణలో భాగంగా శుక్రవారం పెనుమాకలంక గ్రామాన్ని సందర్శించారు. బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు ప్రవాహాలు కొల్లేరులో కలిసే ప్రాంతాన్ని బోటుపై నారాయణ పరిశీలించారు. అనంతరం పెనుమాకలంక గ్రామ కూడలిలో గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కొల్లేరు లంక ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ కొల్లేరు మాఫియా కబంధ హస్తాలలో కొట్టుమిట్టాడుతుందని ధ్వజమెత్తారు. వందల ఎకరాలలో నిబంధనలు విరుద్ధంగా అక్రమంగా చేపల చెరువులు తవ్వి, సహజ సిద్ధమైన కొల్లేరును నాశనం చేశారని మండిపడ్డారు. బుడమేరు ముఖ ద్వారం నుంచి ఉప్పుటేరు వరకు కాలువలు పూడుకుపోయి నీటి పారుదల సౌకర్యం లేక వరదలు వచ్చినప్పుడు లంక గ్రామాలు నీట మునిగి ప్రజల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన లంక గ్రామాలలో మెరుగైన రవాణా సౌకర్యాల కోసం రహదారులు నిర్మించాలని డిమాండ్ చేశారు. కొల్లేరు సమస్యలు పరిష్కారం కాని పక్షంలో ఫిబ్రవరి 1నుంచి దీక్షలకు సిద్ధమని నారాయణ ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమి షన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, వరకా శ్యామల, సీపీఐ ఏలూరు కార్యదర్శి హేమశంకర్ పాల్గొన్నారు.

జగన్ రాజీనామా చేయాలి

ఏలూరు కార్పొరేషన్: జగన్ అసెంబ్లీకి రాకుండా ఉండడం ప్రజలను వ్యతిరేకించడమేనని, అసెంబ్లీకైనా రావాలి లేదా ఎమ్మెల్యేగా రాజీనామా చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వ్యాఖ్యానించారు. శుక్రవారం ఏలూరులో సీపీఐ భవనం వద్ద జరిగిన సభకు సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ కొల్లేరు సరస్సును ఐదవ కాంటూరు వరకు కొనసాగించాల్సిందేనన్నారు. బుడమేరు ముఖ ద్వారం నుంచి ఉప్పుటేరు వరకు పూడిక పనులు చేసి ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ ప్రజా సమస్యలను ఎందుకు పరిష్కరించడంలేదంటూ ప్రశ్నించారు. 2006లోనే సుప్రీంకోర్టు కొల్లేరు పరిరక్షణకై తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. కొల్లేరు ప్రాంతాల్లోని ప్రజలు కొల్లేరులో చేపలు పట్టుకుని అమ్ముకోవాలంటే రోడ్డు మార్గం కూడాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.


సీసలి గ్రామంలో చేపల చెరువుల పరిశీలనకు విచ్చేసిన ఒడిస్సా బృందం

ఒడిస్సా బృందం చేపల చెరువుల పరిశీలన

కాళ్ళ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా రాష్ట్ర మత్స్యశాఖ బృందం కాళ్ళ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటన చేశారు. మత్స్యశాఖలో అత్యధిక దిగుబడి సాధిస్తున్న దృష్ట్యా రైతులు పాటిస్తున్న యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సీసలి గ్రామంలో చేపలు, రొయ్యల చెరువుల సాగుతో పాటు కాళ్ళ గ్రామంలో స్పాన్‌హేచరీలను పరిశీలించారు. తమ రాష్ట్రంలోని మత్స్య సంపదను మరింత మెరుగుపరుచుకోవడం కోసం క్షేత్ర పర్యటకు రావడం జరిగిందన్నారు. సీసలి, చినకాపవరం మత్స్యశాఖ సహాయకులు సత్యనారాయణ, అహ్మద్ హుస్సేన్‌లు ఒడిస్సా బృందానికి సహకరించారు.



ఏపీనిట్‌లో ఆక్టోపస్ మాక్‌డ్రిల్

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ధైర్యంగా ముందుకు సాగాలని ఆక్టోపస్ డీఎస్పీ జగ్గి నాయుడు అన్నారు. పట్టణంలోని ఏపీనిట్ ప్రాంగణంలో ఆక్టోపస్ డీఎస్పీ జగ్గి నాయుడు, ఆర్‌ఐలు బీ.జయప్రకాష్, కె.వర ప్రసాద్, ఎ.రామ్మోహన్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. విపత్కర పరిస్థితులు వాటిని ఏవిధంగా ఎ దుర్కోవాలి అనే దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐలు నాగరాజు, శ్రీను, ఏపీనిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి, ఈఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తణుకులో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలి

శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి



ఇరగవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తణుకులో ఈ ఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. అసెంబ్లీ సమావేశా లలో ప్రశ్నోత్తరాల సమయం లో ఎమ్మెల్యే మాట్లాడారు. తణుకు పరిసర ప్రాంతాల్లో 60 వేల మంది కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఉన్నారని కార్మిక శాఖ మం త్రి దృష్టికి తీసుకువెళ్ళారు. ఈఎస్ఐ బీమా కలిగి ఉన్న సభ్యులు చికిత్స కోసం 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజమండ్రి ఈఎస్ఐ ఆసుపత్రికి వెళ్ళవలసి వస్తుందని 2014-19 మధ్యలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. దీనికి తాము 1.14 ఎకరాల భూమి కేటాయించామని తరువాత 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే నిర్మాణాన్ని గాలికి వదిలేశారని సభకు తెలియ జేశారు. ప్రస్తుతం తణుకులో ఉన్న ఈఎస్ఐ డిస్పెన్సరీ అద్దె భవనంలో ఉందనీ, సిబ్బంది, సౌకర్యాల కొరత ఉందని మంత్రి దృష్టికి తీసుకు వెళ్ళారు. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమర్థిస్తూ తణుకుకు ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరు చేయడానికి 100 శాతం కృషి చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.




ఖాతాల అనుసంధానానికి 30 వరకు గడువు

ఏలూరు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల సొమ్మును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి డీబీటీ ద్వారా జమచేసేందుకు అవసరమైన ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కి అనుసంధానం తప్పనిసరి అని ఏపీ పోస్టల్ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.శివనాగ రాజు తెలిపారు. శుక్రవారం ఇశ్రాయేల్‌పేట శివగోపాలపురం సచివాలయం, ప్రగడవరం పోస్టాఫీసుల్లో స్పెషల్ క్యాంపులను ఆయన పరిశీలించారు. రాష్ట్రంలో దాదాపు 64.81లక్షల ఖాతాలకు ఎన్‌పీసీఐతో ఇంకా లింక్ కాకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయని, వీటిని పునరుద్ధరించడం ద్వారా ఎన్‌పీసీఐకి అనుసంధానం చేసేందుకు పోస్టాఫీసుల్లో నిర్వహిస్తోన్న ప్రత్యేక క్యాంపులు ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతాయని వివరించారు. ఏలూరు డివిజన్ పోస్టాఫీసుల సూపరింటెండెంట్ ఎస్.శ్రీకర బాబు, ఐపీపీబీ రీజనల్ మేనేజర్ సుబ్బారావు, ఏలూరు డివిజన్ సీనియర్ మేనేజర్ రాజేష్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు దుర్గారావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నారికేళం... ధర ఘనం!

- కార్తీకంలో కొబ్బరికి డిమాండ్
- వెయ్యి కాయలు రూ.13వేల నుంచి 18 వేలు
- పండుగల వేళ పెరిగిన వినియోగం
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గరిష్ట ధర
- పశ్చిమలోనూ రైతువారీ కొనుగోళ్లు ముమ్మరం



పాలకొల్లు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి మార్కెట్‌కి కార్తీక శోభ వచ్చింది. ఒక వైపు రైతువారీ కొనుగోళ్ల ధర ఆశాజనకంగా ఉండగా మరో వైపు రిటైల్ మార్కెట్‌లో కొబ్బరి ధర దడ పుట్టిస్తున్నది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రైతువారీ కొనుగోళ్ల ధర గరిష్ఠంగా వెయ్యి కాయలు రూ.13వేలు ఉండగా పాత తూర్పుగోదావరి జిల్లాలో కొబ్బరి రైతువారీ కొనుగోలు ధర వెయ్యి కాయలకి రూ. 16 నుంచి 18వేలు ధర పలుకుతున్నది. కార్తీక మాసం కావడంతో స్థానికంగానూ కొబ్బరికి డిమాండ్ పెరిగింది. దీంతో రైతులు కాయ తయారు కాకుండానే దింపు తీస్తున్నారు. కొబ్బరి చెట్లను దింపిన వెంటనే ఎగుమతులు చేసుకోవడంతో కాయ నిలువ ఆగనప్పటికీ నష్టం లేదని వర్తకులు చెబుతున్నారు. తూర్పు పశ్చిమగోదావరి జిల్లాలో అధిక శాతం నీటికాయ (బొండాలు) తీసివేయడంతో తయారీ కొబ్బరికి డిమాండ్ ఏర్పడింది. సమీప రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటకలలో దిగుబడి తగ్గడంతో ఆంధ్రా కొబ్బరికి డిమాండ్ పెరిగింది. దశమికి ముందు రైతువారీ కొనుగోళ్లలో కొబ్బరి ధర గరిష్ఠంగా రూ.18వేలుకు చేరగా ఇప్పుడు మరోసారి రైతువారీ కొనుగోళ్లు ఊపందుకున్నాయి. పశ్చిమలో ధరలు తక్కువ ఉన్నప్పటికీ తూర్పుగోదావరి జిల్లాలో నాణ్యతను బట్టి కొబ్బరి అధిక ధరలకు కొనుగోళ్లు చేస్తున్నారు. పాత కాయ 28సైజు రిటైల్ మార్కెట్‌లో రూ.25 నుంచి 30కి అమ్ముతున్నారు. ఈధరలు కార్తీక మాసాంతం వరకూ స్థిరంగా ఉంటాయని కొబ్బరి మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ఢిల్లీ క్వాలిటీ (గండేరా) పాత కాయలు డిమాండ్ పెరిగింది. పశ్చిమ రాష్ట్రాలలో డిమాండ్ ఉండే నెంబరు(చిన్నవి) కాయలుకు డిమాండ్ పెరిగింది. 70 బత్తీలు 80బత్తీలు సైజు కాయలు దిగుమతులకు వర్తకులు సిద్ధం చేశారు. తెలంగాణా రాష్ట్రంలోనూ, రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతంలోనూ కార్తీక మాసం సందర్భంగా కొబ్బరి వినియోగం ఘణనీయంగా పెరిగింది. కార్తీక మాసం అనంతరం క్రిస్మస్, సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని వినియోగం పెరుగుతు న్నదున కొబ్బరి మార్కెట్‌కి మరింత ఊతం రావచ్చని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. మొత్తంగా కొబ్బరి రైతులకు పెరిగిన ధర ఊరటనిచ్చింది.

'పది' ఉత్తీర్ణులకు తొలగిన అడ్డంకి

ఏలూరు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్కూలు యాజమాన్యంలో అంతర్గత కుమ్ములాటలవల్ల పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు జూనియర్ ఇంటర్‌లో ఇబ్బందులు పాలవుతున్న ఉదంతంపై జిల్లావిద్యాశాఖ దృష్టిసారించింది. కామవరపుకోట మండలంలోని ఓ అన్‌ఎయిడెడ్ ప్రైవేటు స్కూలు యాజమాన్యం రెండుగా విడిపోయింది. ఫలితంగా స్కూలు నిర్వహణ, విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచ రంగా తయారైంది. ఈ నేపథ్యంలో గత విద్యాసంవత్సరం (2023-24)లో పదోతరగతి పరీక్షలకు ప్రిపేర్ అయిన విద్యార్థులను వివాదా స్పద స్కూలు నుంచి కాకుండా సమీపంలోని మరో ప్రైవేటు స్కూలు నుంచి పరీక్షలు రాయించేశారు. తదుపరి ఉత్తీర్ణులందరూ టెన్త్ షార్ట్ మార్కుల మెమోలతో ఈ ఏడాది జూనియర్ ఇంటర్‌లో చేరారు. ఇపుడు ఒరిజనల్ మార్కుల జాబితాలు వచ్చాయి. వీటిపై సంబంధిత స్కూలు హెచ్‌ఎం సంతకం చేసి విద్యార్థులకివ్వాల్సిఉంది. అయితే తమ స్కూలు రిజిస్టర్‌లో పేర్లు నమోదు కాకుండా టెన్త్ పరీక్షలు రాసి ఉత్తీర్ణులైనంత మాత్రాన పాస్ సర్టిఫికెట్‌లపై సంతకం ఎలా చేస్తానని, ఒకవేళ అలాచేసినా సంబంధిత విద్యార్థులకే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవని హెచ్‌ఎం హెచ్చరించడంతో సమస్య జటిలమైంది. ఇపుడు జూనియర్ ఇంటర్మీడియట్ పరీక్షలకు ఫీజుచెల్లించాలంటే టెన్త్ క్లాస్ ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఈలోగా అనధికారికంగా మూతపడిన స్కూలు యాజమాన్యానికి చెందిన ఒకరు గత సోమవారం డీఈవో కార్యాలయానికివచ్చి అధికారులు, సిబ్బందితో గొడవపడ్డారు. ఇక యాజమాన్యంలో నెలకొన్న అంతర్గత కుమ్ములాటల మధ్య విద్యార్థులు నష్టపోకూడదని విద్యాశాఖ ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. ఈ క్రమంలో సంబంధిత విద్యార్థుల తరఫున తల్లితండ్రులనుంచే ఫిర్యాదు తీసుకుని కలెక్టర్ అనుమతితో టెన్త్ ఉత్తీర్ణులకు పాస్ సర్టిఫికెట్లు ఇవ్వాలని నిర్ణయించింది.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కుళ్లిన చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. వాహనంలోని 10 వేల కిలోల చికెన్ వ్యర్థాలతో పాటుగా వాహనాన్ని స్వాధీనం చేసుకుని చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చిపెట్టించినట్లుగా ఎస్సై తెలిపారు. వాహన, చెరువు యజమానులు, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ఇక జిల్లా కేంద్రాల్లోనే టీచర్లకు శిక్షణ

ఏలూరు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఇకమీదట సంబంధిత జిల్లాల కేంద్రాల్లోనే ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించేలా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ నిర్ణయం తీసుకున్నారని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం విజయవాడలో అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను ఇక్కడి పత్రికలకు తెలియజేశారు. శిక్షణ తరగతుల నిడివిని తగ్గించడంతోపాటు, క్లాసుకు,క్లాసుకుమధ్య పది నిమిషాల విరామం ఉండేలా నిర్ణయించారని వివరించారు. వైద్యపరంగా ఇబ్బందులున్నవారికి, తీవ్ర అనారోగ్య పరిస్థితులున్న వారికి శిక్షణ నుంచి మినహాయింపు ఇస్తారని, అలాగే సహేతుక కారణాలుచూపినవారికీ స్వీయఅభ్యర్థనపై మినహాయింపు ఉంటుందన్నారు. ఆరోగ్యపరంగా ఇబ్బందులున్నవారు యోగా, కల్చరల్ యాక్టివిటీస్‌లో పాల్గొననవసంలేదన్నారు. కాగా ఈ నెల 18నుంచి నాయకత్వ లక్షణాలపై హెచ్‌ఎంలకు రెండోవిడత, ఎఫ్ఎల్ఎన్ పేరిట ఎస్జీటీలకు మూడోవిదత శిక్షణ తరగతులు ప్రారంభంకావాల్సిఉండగా, తాజా పరిణామాలనేపథ్యంలో తేదీలు, వేదికలు మారనున్నాయి. దీనిపై శుక్రవారంసాయంత్రంవరకు అధికారిక ప్రకటన లేదు.

19,20 తేదీల్లో ఆర్టీసీ కార్మికుల నిరసన

భీమవరం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5 నెలలు పూర్తి అయినా ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారం కాక ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఈనెల 19, 20 తేదీల్లో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలుపుతున్నట్లు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్‌పీవీ ప్రసాద్, కార్యదర్శి అల్లం సత్యనారాయణ తెలిపారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చెయ్యాలని, పదోన్నతులు కల్పించాలని, ఉద్యోగులకు రావలసిన బకాయిలు చెల్లించాలని, త్వరలో పేస్కేలు జరిపి మెరుగైన వేతన సవరణ చెయ్యాలని పలు సమస్యలపై ఆందోళన చేపడతున్నామని తెలిపారు.

క్రైమ్ కార్నర్

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

భీమవరం క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భీమవరం మండలం కొవ్వాడ పుంతకు చెందిన నెల్ల వెంకటలక్ష్మి, చినరంగని పాలెంకు చెందిన బొచ్చ సుధ ఆర్టీసీ డిపో వెనుక ప్రాంతంలో ఒక నివాసంలో మహిళలను తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సీఐ నాగరాజు సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో నిర్వాహకులైన ఇద్దరు మహిళలతో పాటు, విటుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన బాధిత మహిళను కూడా అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చామని వారి వద్ద నుంచి రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి



ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న రైలునుంచి ఒక గుర్తు తెలియని యువకుడు జారిపడి మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరవల్లి రైల్వే స్టేషన్ దాటిన తరువాత సుమారు 20 నుంచి 25 ఏళ్ళ వయస్సు కల్గిన యువకుడు రైలు పట్టాల పక్కన మృతి చెంది యున్నాడు. ఈ సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే ఎస్ఐ పి సైమన్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతుడు సుమారు 5 అడుగుల ఎత్తు, ఛామనచాయ శరీరంతో ఉన్నాడు. తెలుపు రంగు చుక్కలతో కూడిన నీలం రంగు రెడీమేడ్ పొడవు చేతుల చొక్కా, నలుపు జీన్‌ప్యాంటు, సపూటా రంగు షార్టు ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎటువంటి ఆరాలు లభించలేదు. అనుమానాస్పద మృతిగా నమోదు చేసి మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు మార్చురీకి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు రైల్వే ఎస్ఐ పి సైమన్ సెల్ నెంబర్ 9989219559కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.



తాటాకు ఇల్లు దగ్ధం

ఆచంట, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): పెదమల్లం శివారు సిర్రావారి పేటలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో లంక ధనరాజుకు చెందిన తాటాకు ఇల్లు దగ్ధమైంది. ధనరాజు, అతని భార్య, కుమారుడు పనులకు వెళ్ళగా కుమార్తె కళాశాలకు వెళ్ళడంతో ఇంటిలో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఇల్లు మొత్తం అగ్నికి ఆహుతి అయ్యింది. సమాచారం తెలుసుకున్న పాలకొల్లు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు 5 లక్షల రూపాయలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని సర్పంచ్ దిరిశాల విజయలక్ష్మి, ఆర్ఐ లక్ష్మి, వీఆర్వో శేషగిరి పరిశీలించి బాధితుడికి బియ్యం అందజేశారు.

సుప్రీంకోర్టు అధికారులమంటూ ఫోన్‌కాల్

కేసు నమోదైందని షూరిటీ బెయిల్‌కు సొమ్ము చెల్లించాలని డిమాండ్
రిటైర్డ్ ఉద్యోగి నుంచి 16 లక్షల 55 వేల రూపాయలు అపహరణ

ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరుకు చెందిన ఒక రిటైర్డ్ ఉద్యోగికి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి తాము ఢిల్లీ నుంచి సుప్రీంకోర్టు ఉద్యోగులమని మీపై కేసు నమోదైందని బెయిల్ పెట్టుకుని వెంటనే షూర్టీ తీసుకోకపోతే అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలు వస్తాయని భయభ్రాంతులకు గురి చేసి ఏకంగా 16 లక్షల 55 వేల రూపాయలను తమ అకౌంట్‌లో వేయించుకున్నారు. అంతేకాకుండా బెయిల్‌కోసం మరో ఐదు లక్షలు జమ చేయాలని బెదిరించడంతో అనుమానం కల్గిన ఆ ఉద్యోగి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఏలూరు ఆర్ఆర్‌పేటలోని అక్కినేని రెసిడెన్స్‌లో నివాసం ఉంటున్న చెందిన కాకరపర్తి ఉదయశంకర్ న్యూ ఇండియా ఎష్యూరెన్స్ కంపెనీలో పనిచేసి రిటైర్ అయ్యారు. ఆయనకు ఒక గుర్తు తెలియని నెంబర్ నుంచి కాల్ రావడంతో లిఫ్టు చేశారు. తాము సుప్రీంకోర్టు ఉద్యోగులమని మీపై కేసు ఫైల్ అయిందని వెంటనే అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలు వస్తున్నాయని వారిని ఆపాలంటే వెంటనే షూరిటీ సొమ్ము చెల్లించాలని నాలుగు దఫాలుగా గత రెండు రోజుల నుంచి 16 లక్షల 55 వేల రూపాయలను వివిధ అకౌంట్లో వేయించుకున్నారు. అంతేకాకుండా బెయిల్ కోసం మరో 5 లక్షల రూపాయలు ఫీజు చెల్లించాలని భయభ్రాంతులకు గురిచేయడంతో తాను మోసపోయానని గుర్తించి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వైవీ రమణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

ఇద్దరికి గాయాలు


కుక్క దాడిలో గాయపడిన వృద్ధుడు

నరసాపురం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. 11వ వార్డు పార్కు రోడ్‌లో వెళుతున్న కనకం నాగేశ్వరరావు, ఎ.సూర్యనారాయణలను గాయపర్చింది. ఈ విషయం తెలుసుకుని పలువురు పరుగులు తీశారు. గాయపడిన ఇద్దరిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరికి రేబిస్ ఇంజక్షన్ డోస్ ఇచ్చారు. పిచ్చి కుక్క కోసం స్థానికులు గాలిస్తున్నారు. ఇదిలా ఉంటే పట్టణంలో ఇటీవల కుక్కల బెడద పెరిగింది. స్టీమర్‌రోడ్, పంజాసెంటర్, వైఎస్ఆర్‌కాలనీ, రైల్వేస్టేషన్ రహదారుల్లో చీకటి పడితే కుక్కల బెడద తప్పడం లేదు.

బాలిక అదృశ్యం

యలమంచిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏనుగువానిలంక గ్రామానికి చెందిన మైనర్ బాలిక కనిపించకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.గుర్రయ్య శుక్రవారం తెలిపారు. బాలిక తన ఇంటివద్ద నుంచి గురువారం ఉదయం కళాశాలకు వెళ్లి ఎంతకూ తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు ఆమె ఆచూకీకోసం గాలించినప్పటికీ, లభించకపోవడంతో ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు వ్యాపారులపై కేసు నమోదు


దుకాణం వద్ద తనిఖీలు చేస్తున్న అధికారులు

నరసాపురం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బిచర్ల గ్రామంలో కాలం చెల్లిన తినుబండారాలు విక్రయిస్తున్న ఇద్దరు వ్యాపారులపై ఫుడ్ కంట్రోల్ అధికారులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని స్కూల్ పిల్లలకు కాలం చెల్లిన తినుబండారాలు విక్రయిస్తున్నట్టు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారికి ఫిర్యాదులు అందాయన్నారు. ఆయన అదేశాల మేరకు గ్రామంలోని రెండు కిరాణషాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. రెండు దుకాణాల్లో నిల్వ సరుకులు గుర్తించామన్నారు. వ్యాపారి వి వెంకట సురేష్, వి.రాజులపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ, వీఆర్వో సూర్యనారాయణ పాలొన్నారు.

గ్యాస్ సిలిండర్లు సీజ్



ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒక హోటల్‌లో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారని జిల్లా విజిలెన్సు ఎస్పీ వి.శ్రీరాంబాబుకు సమాచారం అందడంతో ఆయన ఆదేశాల మేరకు విజిలెన్సు ఎమ్మార్వో బి.కన్యాకుమారి, ద్వారకా తిరుమల సీఎస్‌డీటీ పి.కామేశ్వరరావు, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు కలిసి దాడి చేశారు. ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్ గ్రామంలో ఛాయ్ బిస్కెట్ ఫుడ్‌జోన్ హోటల్‌ను తనిఖీ చేసి ఐదు గ్యాస్ సిలిండర్లను గుర్తించారు. రెస్టారెంట్ యజమాని భలే విశ్వేశ్వరరావుపై కేసు నమోదు చేశారు. గ్యాస్ సిలిండర్ల విలువ 13,856 రూపాయలు అని తెలిపారు.

విజిలెన్సు అధికారుల దాడులు

ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విజిలెన్సు ఎస్ఐ సీహెచ్ రంజిత్ కుమార్, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ సుంకరవారి తోటలో శుక్రవారం సాయంత్రం నిఘా పెట్టారు. ఏలూరు రూరల్ మండలం పోణంగికి చెందిన పరిసే డేవిడ్‌రాజు తన ఆటోలో 600 కేజీల రేషన్‌బియ్యాన్ని వేసుకుని వస్తుండగా అతనిని ఆపి విచారించారు. ఏలూరు పరిసర ప్రాంతాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని కొనకళ్ళ సాయిమనోజ్ కుమార్‌కు అమ్మి కాకినాడకు తరలిస్తున్నట్లుగా తెలిపారు. బియ్యం విలువ రూ.24 వేలు కాగా ఆటో విలువ లక్ష రూపాయలు. బియ్యం, ఆటోను సీజ్‌చేసి డేవిడ్‌రాజు, మనోజ్ కుమార్, నిమ్మల పవన్‌కుమార్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరిపై ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు కూడా నమోదు చేశారు.



కారు బోల్తా

ద్వారకాతిరుమల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శివారు వేపాలమ్మ ఆలయ సమీపంలో ఓ కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. తిమ్మాపురానికి చెందిన ఓ మహిళ కారును డ్రైవ్ చేస్తూ ద్వారకాతిరుమల నుంచి కామవరపుకోట వైపుకు వెళ్తోంది. మార్గం మధ్యలో వేపాలమ్మ ఆలయ సమీపానికి వచ్చేసరికి కారునడుపుతూ ఫోన్ మాట్లాడుతున్న ఈమె వాహనాన్ని కంట్రోల్ చేయలేక రోడ్డుపక్కగా పడిపోయి ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఆ తరువాత కారు అదుపుతప్పి బోల్తా కొట్టగా ఆమెకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో ఆమెను ద్వారకాతిరుమల పీహెచ్‌సీలో చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



భీమవరంలో బిర్సా ముండా చిత్ర పటంవద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగరాణి

బిర్సా ముండాను ఆదర్శంగా తీసుకోవాలి

భీమవరంటౌన్/పెంటపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దేశంలో బ్రిటిష్ వారి వలస వాద వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన గిరిజన నేత భగవాన్ బిర్సా ముండా అని కలెక్టరు నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బిర్సా ముండా జయంతిని ఘనంగా నిర్వహించారు. ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీ. రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ముండా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీన్ డాక్టర్ వి.సందీప్, సాస్ అసిస్టెంట్‌లు సంధ్యారాణి, సాయిరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇందుకూరి



గణపవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గణపవరం మండలం పిప్పరకు చెందిన ఇందుకూరి రామకృష్ణంరాజు నియమితులయ్యారు. పదేళ్లుగా టీడీపీ మండల అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. ఆయన తండ్రి సుబ్బరాజు మండల పరిషత్ మొదటి అధ్యక్షుడిగా, సోదరి గొట్టుముక్కల విజయలక్ష్మి కూడా ఎంపీపీగా పని చేశారు. రామకృష్ణంరాజును క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడంపై టీడీపీ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మంతెన రామరాజు అభినందించారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

భీమవరం అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వర్గీకరణకు వ్యతిరేకంగా తెలంగాణ తరహాలో మాల ప్రజాప్రతినిధులు బయటికి వచ్చి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. మెంటేవారితోటలో శుక్రవారం మాల మహానాడు ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇంటి సుందర్ కుమార్, నేతల సువర్ణరాజు, నేతల సాల్మన్‌రాజు, దాసరి చిరంజీవి యాకోబు తదితరుల పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రంలో తహసీల్దార్ సందర్శన

అత్తిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లాల పట్ట భద్రుల నియోజకవర్గం ఎన్నికల నిమిత్తం అత్తిలిలో ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాన్ని అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ పరిశీలించారు. శుక్రవారం అత్తిలిలోని ఎస్వీఎస్సెస్ డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రానికి అవసరమైన సదుపాయాలను పరిశీలించారు. కార్యాయల సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై దాడి.. ఇద్దరిపై కేసు

పాలకొల్లు రూరల్/ఆకివీడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): లంకలకోడేరు శివారు వెదుళ్ళపాలెంలో బెల్ట్ షాపు నిర్వాహిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశామని పాలకొల్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం వెదుళ్ళపాలెంలో మాదు వెంకటేశ్వరరావు అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి ఏడు మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐలు పి.మహేష్, జి.రఘు, ఇబ్బంది పాల్గొన్నారని, బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆకివీడు మండలం అప్పారావుపేటకు చెందిన పి.సత్యనారాయణ నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులో మద్యం అమ్ముతుండగా కేసు నమోదు చేసి తొమ్మిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఎస్‌ఐ కరుణ ప్రియ శుక్రవారం తెలిపారు.

ఉండిలో అన్నసమారాధన

ఉండి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం పురస్కరించుకుని ఉండిలో నాంచారమ్మ తల్లి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉండి దేవునిదొడ్డి ప్రాంతంలో వున్న శ్రీనాంచారమ్మ తల్లి ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ కమిటీ వారు మాట్లాడుతూ కార్తీకమాసంలో వచ్చే శుక్రవారాల్లో ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తామని తెలిపారు.

ఓ వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



బెంజిమెన్ (ఫైల్)

కాళ్ళ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కుమారుడు కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని కాళ్ళ పోలీసులు శుక్రవారం తెలిపారు. కాళ్ళ మండలం ఎస్సీ బోసకాలనీ గ్రామానికి చెందిన పి.బెంజిమన్‌కు వివాహమై ఇద్దరు సంతానం ఉన్నారు. శుక్రవారం సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని తిరిగి ఇంటికి రాకపోవడంతో తండ్రి సుందరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఎన్. శ్రీనివాసరావు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96649 సమాచారం ఇవ్వాలని కోరారు.







యలమంచిలి శివాలయం వద్ద జ్వాలాతోరణం.. పెనుగొండలో నగరేశ్వరస్వామి వారు.. మావుళ్ళమ్మ ఆలయంలో చండీ హోమం.. ఆకివీడు దత్తక్షేత్రంలో పూర్ణాహుతి పూజలు.. పెంటపాడులో దుర్గామల్లేశ్వరి కల్యాణోత్సవం

కార్తీక పౌర్ణమి పూజలు

శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

వైభవంగా జ్వాలా తోరణ కార్యక్రమాలు

•పాలకొల్లు అర్బన్/యలమంచిలి : కార్తీక పౌర్ణమి సదర్భంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. మహిళలు ఉపవాసాలు ఆచరించి సాయంత్రం ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. పాలకొల్లు కోడిగట్టున వున్న అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వ రస్వామి ఆలయంలో లక్షపత్రి పూజ నిర్వహిం చారు. స్వామివారికి మహాన్యాసపూర్వక అభిషేకా ల అనంతరం మారేడు బిల్వాలతో లక్షపత్రి పూజ చేసి స్వామి, అన్నపూర్ణ అమ్మవార్లకు అలంకరణలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. 24వ వార్డు శంభన్న అగ్రహారంలోని శంభేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి జ్వాలాతోరణం వెలిగించారు. యలమంచిలి మండలం యలమంచిలిలోని ఉమాసోమేశ్వర స్వామి ఆలయం వద్ద జ్వాలా తోరణం వైభవంగా నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలు ఆచరించి, కార్తీక దీపాలు వెలిగించారు.

• భీమవరంటౌన్ : మావుళ్ళమ్మ ఆలయంలో దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం చండీహోమం నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో హోమాలను నిర్వహించి పూర్ణాహుతితో కార్యక్రమాన్ని పరిసమాప్తి చేశారు. 87 మంది భక్తులు పూజల్లో పాల్గొన్నారు. వీరికి దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్, అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. పట్టణంలోని ఇండియన్ బ్యాంకు రోడ్డులో ఉన్న పార్వతీ సమేత సోమేశ్వరస్వామికి చామంతులతో ప్రత్యేక అలంకరణ చేశారు.

• శ్రీరాంపురంలోని శ్రీచక్రసహిత కనకదుర్గ అమ్మవారి ఆలయంలో కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యం, సత్యప్రసాద్ సంయుక్త ఆధ్వర్యంలో దాత డాక్టర్ దండు వెంకటసత్యరామకృష్ణంరాజు దంపతులు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. విజయవాడకు చెందిన అభిషేక్ శర్మ శ్రీచక్ర నిర్వహించారు.

• పెనుగొండ : పెనుగొండ వాసవి శాంతి ధామ్ క్షేత్రంలలో ద్వాదశ జ్యోతిర్లింగేశ్వర మందిరంలో విశేష అలంకరణ దర్శనంతో నగరేశ్వరస్వామి వారు భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్తీక పౌర్ణమి కావడంతో భక్తులు క్యూలైన్‌లు కట్టి స్వామిని దర్శించుకున్నారు.

• తాడేపల్లిగూడెం అర్బన్/పెంటపాడు : కార్తీక పౌర్ణమి సందర్భంగా పట్టణ ప్రజల ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలు, నదీజాలాలు, పసుపు, కుంకుమలతో అభిషేకాలు చేసి, దీపాలంకరణ నిర్వహించారు. పెంటపాడు మండలం పెంటపాడులో పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి పల్లకీసేవ, జ్వాలా తోరణం పూజలు నిర్వహించారు. ఈనెల 29న లక్ష బిల్వార్చన, భారీ అన్నసమారాధన జరుగుతా యని కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి తెలిపారు. పెంటపాడు వెలమ యువజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న గౌరీదేవి ఉత్స వాలలో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణం వద్ద విజయవాడ దుర్గామల్లేశ్వరి కల్యాణాన్ని పండితులు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు.

• ఆకివీడు : ఆకివీడు మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దత్త క్షేత్రంలో వేద పండితులు పూర్ణాహుతి పూజలు చేశారు.

• గణపవరం : గణపవరంలో సువర్ణేశ్వర స్వామి, భ్రమరాంబ మల్లికార్జునస్వామి, అర్ధవరం మార్కండేయస్వామి, పిప్పర శివాలయాలు శివ నామసర్మరణతో మార్మోగాయి. సువర్ణేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలాతోరణం నిర్వహించారు. అనంతరం కోజాగిరి ఉత్సవం జరిగింది.

• ఇరగవరం : ఇరగవరం మండలం ఒగిడి శివాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్థుల ఆధ్వర్యంలో 19,000 ప్రమిదలతో దీపాలు వెలిగించి గ్రామ వీధులల్లో శివలింగం, త్రిశూలం, ఓం వంటి పలు అలంకరణలు చేశారు.

గణపవరంలో టీడీపీ మండల కార్యాలయం ప్రారంభం



గణపవరంలో టీడీపీ భవనం ప్రారంభిస్తున్న ఎంపీ పుట్టా, ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని

గణపవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గణపవరంలో టీడీపీ మండల కార్యాలయాన్ని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్, టీడీపీ పశ్చిమ, ఏలూరు జిల్లాల అధ్యక్షులు మంతెన రామరాజు, గన్ని వీరాంజనేయులు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఎంపీ మాట్లాడుతూ ఆరాచక, అసమర్థ చీకటి పాలనలో రాష్ట్రం మూడు దశాబ్దాలు వెనక్కి వెళ్ళిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళుతుందన్నారు. నియోజకవర్గానికి కోటి 50 లక్షలు రూపాయలు ఎంపీ నిధుల నుంచి మంజూరు చేసినట్టు తెలిపారు. గన్ని మంతెన మాట్లాడుతూ కొల్లేరు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఇందుకూరి రామకృష్ణంరాజు, అద్దేపల్లి వాసురాజు, కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, యాళ్ళ సుబ్బారావు, ముచ్చర్ల వేణు, కాపారం చిన్న, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి : ఏఎస్పీ

రెండో రోజు గ్రంథాలయ వారోత్సవాలు



పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన ఏఎస్పీ భీమారావు

భీమవరంటౌన్/భీమవరం రూరల్/ఉండి/గణపవరం/ ఆకివీడు/ పెనుమంత్ర/ పాలకొల్లు అర్బన్/భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థు లు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని అడిషనల్ ఎస్పీ వి.భీమారావు సూచించారు. భీమవరం పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాల య వారోత్సవాలలో భాగంగా రెండో రోజు శుక్రవారం పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. వన్‌టౌన్ ఎస్‌ఐ ఎస్.కృష్ణాజీ, డి.రామనాగేశ్వర రావు తదితరులు ఉన్నారు. భీమవరం కేజీఆర్‌ఎల్ ఫార్మసీ కళాశాలలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం శాఖ చీఫ్ మేనేజర్ నిర్మల జ్యోతి ఆధ్వర్యంలో, ఉండి మండలం యండగండి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయా భివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రవికుమార్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్స వాలు నిర్వహించారు. గణపవరం మండలం గణపవరం, పిప్పర శాఖ గ్రంథాల యాల్లో పుస్తక ప్రదర్శ నిర్వహించారు. పిప్పర యూనియన్ బ్యాంకు మేనేజర్ దుర్గామహేశ్, ఎస్‌బీఐ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. ఆకివీడు గ్రంథాల యంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దాసరి సత్యనారాయణ ఆధ్వర్యంలో పుస్తక పఠనం, ప్రదర్శన, వ్యాసరచన పోటీలు నిర్వహిం చారు. లైబ్రరీ నిర్వాహకురాలు పార్వతి ఉన్నారు. పెనుమంత్ర మండలం మార్టేరు గ్రంథాలయంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుడిమెట్ల రామారెడ్డి ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పాలకొల్లు పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు జి.సీతారామ్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. గ్రంథాలయాధికారిణి వి.శాంత కుమారి, విశ్రాంత ఎస్‌బీఐ ఉద్యోగి వీవీఎస్ఎన్ మూర్తి తదితరులు ఉన్నారు. భీమవరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అనురాధ , డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడమే 'గ్లోబల్' ఆశయం

పాలకోడేరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడమే గ్లోబల్ ఫౌండేషన్ ఆశయం అని ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ భూపతిరాజు పెండేటి అన్నారు. కోరుకొల్లులో మంతెన ప్రహ్లాదరాజు ట్రస్టు ఆధ్వర్యంలో గ్లోబల్ ఫౌండేషన్ సహకారంతో రూ.పది లక్షలతో నిర్మించిన ఆర్‌వో ప్లాంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రాష్ట్రాల్లో 27 గ్రామాల్లో ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. అనంతరం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ భూపతి రాజు భారతి, ప్రహ్లాదరాజు, ట్రస్టు చైర్మన్ మంతెన యోగేంద్రకుమార్, ఉపసర్పంచ్ సీతారామరాజు, తిరుపతి రాజు, చంటి రాజు, భీమవరం వర్మ హాస్పిటల్ డాక్టర్ పీఆర్‌కేవర్మ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిల నియామకం

కాళ్ళ/ఇరగవరం/నరసాపురం నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జిగా వేగేశ్న గోపాలకృష్ణంరాజు, తణుకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిగా దర్శిపో రామకృష్ణ, నరసాపురం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా పోలిశెట్టి వీరవెంకట నారాయణస్వామిని నియమిస్తూ ఆ పార్టీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉండి ఇన్‌చార్జి వేగేశ్న గోపాలకృష్ణంరాజు గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉండి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేశారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తణుకు ఇన్‌చార్జి రామకృష్ణ మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించిన షర్మిల రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీకి పూర్వవైభం తీసుకొచ్చి ఆమె నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నరసాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ బాబ్జి మాట్లాడుతూ 1983 నుంచి పార్టీలో కొనసాగుతున్నానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. వారిని ఆయా నియోజకవర్గాల నాయకులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

పోటీ పరీక్షల్లో 'టీబీఆర్' విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు సాధించిన విద్యార్థులు

పెంటపాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : ఏపీపీయూఎస్ఎంఏ ద్వారా జరిగిన పోటీ పరీక్షలలో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని టీబీఆర్ సైనిక్ స్కూల్ చైర్మన్ తనుబుద్ధి భోగేశ్వరరావు అన్నారు. ప్రతిభ కనబర్చి ప్రశంసాపత్రాలను సాధించిన విద్యార్థులకు శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో అభినందనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని అప్పుడే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పద్మావతి, సీఈవో రవికిరణ్, హెచ్‌ఎం కళ్యాణి, ఏవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యూఎస్ నార్త్ ఈస్టర్న్ వర్సిటీతో 'ఎస్ఆర్‌కేఆర్' ఎంవోయూ

భీమవరం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు యూఎస్‌ఏలో మంచి విద్యాలయాలలో చదువుకునేందుకు యూఎస్‌ఏలోని నార్త్ ఈస్ట్రన్ యూనివర్సిటీస్‌తో ఎంవోయూ చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు తెలిపారు. ఇటీవల ముంబైలో జరిగిన కార్యక్రమంలో నార్త్ ఈస్ట్రన్ యూనివర్సిటీ అసిస్టెంట్ వైస్ ఛాన్సలర్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎన్రోల్మెంట్ మేనేజ్మెంట్ ఫెడరీకోలింగ్ వంశీకృష్ణ జంగాతో ఎంవోయూ కుదుర్చుకున్నట్టు తెలిపారు. కళాశాల ఇంగ్లీష్, ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ బీహెచ్‌వీఎన్ లక్ష్మి, సెక్రటరీ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ, డైరెక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడారు.



డిప్యూటీ స్పీకర్ రఘురామను సత్కరించిన ఉండి మండల టీడీపీ నాయకులు

డిప్యూటీ స్పీకర్ రఘురామను కలిసిన టీడీపీ నాయకులు

ఉండి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజుకు డిప్యూటీ స్పీకర్‌గా నియమించడం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, పార్టీ సీనియర్ నాయకులు తోట రాము, కందుల బలరాం అన్నారు. శుక్రవారం ఉండి మండల టీడీపీ సీనియర్ నాయకులు అమరావతి వెళ్లి ఆయ నను కలిసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పేరిచ ర్ల బాలరాజు, మంతెల సాయిలచ్చిరాజు, వర్రే సముద్రమూర్తి, గురుగుబిల్లి వెంకటసత్య నారాయణ తదితరులు ఉన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి : తోట



టీడీపీ సభ్యత్వ నమోదులో తోట సీతారామలక్ష్మి

భీమవరం అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పార్టీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. పట్టణంలో 22, 25, 27వ వార్డులలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్నవారికి ప్రమాద బీమా వైద్య ఆర్థిక సాయాన్ని కార్యకర్తల సంక్షేమ సహాయ నిధి నుంచి అందించనున్నామని తెలిపారు. అనంతరం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, గూడూరి సుబ్బారావు మాట్లాడారు. పార్టీ నాయకులు విజ్జురోతు రాఘవులు, గొంతెన రమణ, గనిరెడ్డి త్రినాథ్, ఐజాక్‌బాబు, జంపన ధనరాజ్, లంకి చిన్న, గునుపూడి తిరుపాల్, నేదునూరి గంగాధర్ తిలక్ పాల్గొన్నారు.

• ఏపీ ప్రభుత్వ రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఉప్పులూరి చంద్రశేఖర్ శుక్రవారం జిల్లా రజక నాయకులతో కలిసి తోట సీతా రామలక్ష్మిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ అస్మా ఫర్హీన్

ఇరగవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఎస్టీల చట్టాలపై అవగాహన ఉండాలని అడిషనల్ ఎస్పీ అస్మా ఫర్హీన్ అన్నారు. తణుకు పట్టణంలోని పలు కాలేజీల విద్యార్థులకు సీఎం ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఏపీసీఐడీ ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రిటైర్డ్ సీనియర్ పీపీ గోపాల్‌రావు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ చట్టం, సమాజంలో అంటరానితనం నిర్మూలనపై, ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్‌పై, అట్రాసిటీ యాక్ట్‌పై అవగాహన కల్పించారు. పలు కేసులు ఎదుర్కొంటున్న బాధితులు కుల ధ్రువీకరణ పత్రం తీసుకునే విధానం, సదస్సుకు వచ్చిన వారు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పి అవగాహన కల్పించారు. అందరూ బాగా చదువుకుని, చట్టాలపై అవగాహన చేసుకోవాలని సూచించారు. సదస్సు అనంతరం ప్రసంగించిన వక్తలను ఎడిషన్ ఎస్పీ సీఐడీ రాజమహేంద్రవరం వారు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఎస్‌డీపీవో డి. విశ్వనాథ్, తణుకు తహసీల్దార్ బీవీఎస్ఎస్ అశోక్‌వర్మ, ఎంపీడీవో జయసాగర్, తణుకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, రాజమండ్రి సీఐడీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, ప్రముఖ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించాలి



నరసాపురంలో సీపీఎం నాయకుల ఆందోళన

నరసాపురం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపమని వాగ్దానాలు చేసిన ప్రభుత్వాలు అధికారంలోకి రాగానే వాటిని విస్మరించాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కవురు పెద్దిరాజు విమర్శించారు. ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. అనంతరం పెద్దిరాజు, ఎం.త్రిమూర్తులు మాట్లాడుతూ జిల్లాలో ఉచిత ఇసుక ఎక్కడ అమలు కావడం లేదన్నారు. సక్రమంగా ఇసుక దొరక్కపోవడం వల్ల వేలాది మంది కార్మికులు ఉపాధికి దూరమయ్యారన్నారు.పి.నారాయ ణరావు, కొండ, జోగేశ్వరరావు, లక్ష్మణ్, బద్రి, సత్తిబాబు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి

పెంటపాడు : నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు చిర్లా పుల్లారెడ్డి, సిరపరపు రంగారావు, దూలం ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రజా సమస్యలపై ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు గ్రామాల్లో ప్రజాపోరు నిర్వహించి కరపత్రాలను అందజేశామన్నారు.ఆకుల రాజు, తాడి బాలయ్య, పులుపు మన్మధరావు, బొంతల నాగరాజు, పెనగంది దుర్గ, బడేటి సుబ్బారావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో 'సీఎస్ఎన్' విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులకు సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేస్తున్న డాక్టర్ సత్యనారాయణ

భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో డాక్టర్ సీఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని కళాశాల సెక్రటరీ డాక్టర్ చీడే సత్యనారాయణ తెలిపారు. ఈనెల పది నుంచి పన్నెండో తేదీ వరకు 68వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాల క్రీడాప్రాంగణంలో జరిగిన అండర్-19 నెట్ బాల్ బాల బాలికల పోటీలలో పశ్చిమ గోదావరి జిల్లా బాలుర విభాగంలో ప్రథమ స్థానం, అండర్-19 బాలికల విభాగంలో తృతీయ స్థానం, అండర్-17 బాలుర విభాగంలో ద్వితీయ స్థానం సాధించిందని ప్రిన్సిపాల్ ఎం.డి. సలీంఖాన్ తెలిపారు. విజేతలైన క్రీడాకారులకు సర్టిఫికెట్స్, మెడల్స్‌ను కళాశాల సెక్రటరీ చీడే సత్యనారాయణ అందించి అభినందించారు. కోచ్ దావూద్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



భీమవరంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

హీరో కృష్ణకు ఘన నివాళి

భీమవరం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మనసున్న మారాజు.. సినీ నటుడు, ఘట్టమనేని కృష్ణ అని టౌన్ వైడ్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు బోణం వర ప్రసాద్ అన్నారు. శుక్రవారం భీమవరం మల్టీప్లెక్స్ పక్కన కృష్ణ ద్వితీయ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెండితెర నట శిఖరం, తెలుగు సినీ సింహాసనానికి శాశ్వత రారాజు సూపర్ స్టార్ కృష్ణ అన్నారు. కృష్ణ అభిమానులు పేరిచర్ల శ్రీనివాస్‌రాజు, వంకల బోస్ యాదవ్, నులుహరి కుమార్, రామరాజు, ధర్మారావు, ఎస్.పండు, ఎస్.రవి, కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

18న ఆశా వర్కర్ల ధర్నా

భీమవరం అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలు జీవోలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చింతపల్లి లక్ష్మి, దిగుపాటి జ్యోతి తెలిపారు. శుక్రవారం భీమవరంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు హామీలను ఇవ్వడమే తప్ప అమలు చేయకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధికారులను ప్రజాప్రతినిధులను ఎన్నోసార్లు కలిసి సమస్యలను వివరించినా నేటి వరకు పట్టించుకోలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన హామీలను జీవోలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న అయి-భీమవరం రోడ్ నివాసితులు

అర్హులకు ఇళ్లు నిర్మించి వసతులు కల్పించాలి

ఆకివీడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అర్హులకు ఇళ్ల పట్టాలిచ్చి, ఇళ్ల నిర్మాణాలు చేపట్టి, మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు బొద్దుపల్లి రాంబాబు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావుకు బాధితులతో కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అధికారులు సమస్యలు పరిష్కరించకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళతామన్నారు. పెంకి అప్పారావు, సందక సూరిబాబు, గేదెల ధనుష్, శ్రీను, వెంకన్న, రమణ, భవాని, తులసి తదితరులు ఉన్నారు.



క్రీడా సామగ్రి అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల వితరణ

పాలకొల్లు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఎంకెఎస్‌ఎం హైస్కూలు విద్యార్థులకు అదే స్కూల్లో 89-94 మధ్య చదివిన పూర్వ విద్యార్థులు క్రీడా పరికరాలను అందించారు. ఇండోర్‌లో ఆడుకునే విధంగా క్యారం బోర్డు, స్కిప్పింగ్ రోప్, టెన్నికాయిట్ రింగ్స్ వంటి పలు క్రీడా పరికరాలను శుక్రవారం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుదర్శనం శేషుబాబు, వేగిరాతి భాస్కర్, గుణ్ణం రామాంజనేయులు, హెచ్‌ఎం అడ్డాల సత్యనారాయణ, పీఈటీ రుద్రరాజు బలరామరాజు తదితరులు ఉన్నారు.